వేధిస్తున్న లారీల కొరత

కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం మిల్లులకు తరలించేందుకు ఇబ్బందులు
- నేటికీ కేంద్రాల్లోనే వడ్లు
- ఆందోళనలో రైతులు

మునుగోడు: మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని స్థానిక మిల్లులకు రవాణా చేసేందుకు లారీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. సరిపడా లారీలు రాకపోవడంతో 15 రోజుల క్రితమే పూర్తి కావాల్సిన ధాన్యం నేటికీ కల్లాల్లోనే నిల్వ ఉంది. ధాన్యం దిగుమతి చేసుకోవాల్సిన మిల్లర్లు మిల్లుల వద్దకు వచ్చిన ధాన్యం లారీలను రెండు, మూడు రోజుల పాటు దిగుమతి చేసుకోకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో స్థానిక లారీల యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకమారు తీసుకెళ్లిన లోడు దిగుమతి అయినా తరువాత తిరిగి రవాణా చేసేందుకు ముందుకు రావడం లేదు. మునుగోడు మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసినా 11 ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల్లో


ఊకొండిలోని కొనుగోలు కేంద్రంలో మిల్లుకు తరలించకుండా తూకం వేసి ఉంచిన ధాన్యం

ఒక్కో కేంద్రంలో దాదాపు 15 నుంచి 20 మంది చొప్పున దాదాపు 100 మంది రైతుల ధాన్యం రాశులు కుప్పలుగా పేరుకుపోయాయి.

45 లారీలు వస్తే కొనుగోళ్లు పూర్తి..

మండల వ్యాప్తంగా మొత్తం 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో ఇప్పటి వరకు 2,997 మంది రైతుల నుంచి లక్షా 54వేల 850 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. 6 కేంద్రాల్లో ధాన్యం పూర్తిగా కొనుగోలు చేయగా అవి గత వారం రోజుల క్రితమే మూసివేశారు. మిగిలిన కల్వలపల్లి, సింగారం, కొంపల్లి, పలివెల, మునుగోడు గ్రామాల్లోని కేంద్రాల్లో దాదాపు 250 మంది రైతుల ధాన్యం నేటికీ తూకం వేయకుండా ఉంచారు. ఆ ధాన్యం మొత్తం తూకం వేసి మిల్లులకు తరలించేందుకు దాదాపు 45కుపైగా లారీలు అవసరం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. లారీలు రాకపోవడంతో తాముచేసేదేమీలేక వచ్చినప్పుడు మాత్రమే రోజుకు ఒకటి, రెండు లారీలని లోడు చేసి మిల్లులకు తరలిస్తున్నామని పేర్కొంటున్నారు.

లారీ కిరాయి చెల్లించాలంటున్న నిర్వాహకులు

మిల్లుల వద్ద వెంటవెంటనే ధాన్యం దిగుమతి చేసుకోకపోవడంతో లారీల యజమానులు తిరిగి రావడం లేదని, లారీ తిరిగి రావాలంటే అదనంగా లారీ కిరాయి డబ్బులు ఇవ్వాలని కేంద్రం నిర్వాహకులు రైతులను అడుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కిరాయి ఇవ్వని రైతుల ధాన్యం తాము మిల్లులకు తరలించలేమని బాహాటంగా చెప్పుతున్నట్లు పలువురు రైతులు వాపోతున్నారు. దీంతో కొందరు రైతులు రోజుల తరబడి వేచి ఉండలేక కిరాయి డబ్బులు ఇచ్చి తమ ధాన్యం మిల్లులకు పంపుతుండగా, ఇవ్వని రైతుల ధాన్యం కేంద్రాల్లో నిల్వ ఉంటున్నాయి.

లారీలు తెచ్చుకోమంటున్నారు



నేను 25 రోజుల క్రితం మునుగోడులోని కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చా. కానీ ఇప్పటికీ కొనుగోలు చేయలేదు. సొంత డబ్బులతో లారీ తెచ్చుకుంటేనే తూకం వేస్తామని నిర్వాహకులు చెబుతున్నారు. ఇదేంటని అడిగితే లారీలు రావడం లేదు.. మిల్లుల్లో దిగుమతి చేసుకోవడం లేదని చెబుతున్నారు.

– బాలెం నర్సింహ, రైతు, సోలిపురం

మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి



ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని రైతులు అమ్మిన ధాన్యం వెంటవెంటనే మిల్లు యజమానులు దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలి.

– కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్

త్వరలో పూర్తిగా రవాణా చేయిస్తాం



స్థానిక మిల్లులో ధాన్యం దిగుమతి చేసుకునేందుకు అవసరమైన స్థలం లేకపోవడంతో 4,5 లారీలు మాత్రమే అన్‌లోడ్ చేసుకుంటున్నారు. కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు రవాణా చేయాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌కు సూచించాం. 2,3 రోజుల్లో పూర్తిగా రవాణా చేయిస్తాం.

– కృష్ణారెడ్డి, తహసీల్దార్, మునుగోడు

క్లుప్తంగా

నాణ్యమైన విత్తనాలు అందించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ టూటౌన్: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండలో వ్యవసాయ శాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. నకిలీ విత్తనాలు విక్రయించే ముఠా, దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వాటిని విక్రయించే వ్యాపారుల లైసెన్స్‌లు రద్దు చేయాలన్నారు. విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి, దాసోజు యాదగిరాచారి, చల్లమల్ల సీతారాంరెడ్డి, సాయన్న తదితరులు ఉన్నారు.

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు


ఫర్టిలైజర్ దుకాణాల యజమానులతో నిర్వహించిన సమావేశంలో అధికారులు

మునుగోడు: అధిక లాభం కోసం రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టి, వారిని మోసం చేయొద్దని తహసీల్దార్ కృష్ణారెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్ ఫర్టిలైజర్ వ్యాపారులకు సూచించారు. బుధవారం మునుగోడులోని రైతువేదికలో మండలంలోని ఫర్టిలైజర్ వ్యాపారులకు విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలను తీసుకువచ్చి విక్రయించాలని తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏఎస్ఐ ఖలీల్, ఫర్టిలైజర్ వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడికి రాజ్యాంగ గ్రంథాన్ని అందించాలి


తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న డీఎస్పీ నాయకులు

మర్రిగూడ: భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరుడికి ఉచితంగా అందించాలని డీఎస్పీ (ధర్మ సమాజ్ పార్టీ) నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం మర్రిగూడలో తహసీల్దార్ దేవులపల్లి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు స్థానిక బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. వారిలో రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు గిరి, వినోద్, రాజు, జగన్, సాయి, కొండల్‌గౌడ్, వినయ్, గణేష్, శివ, నవీన్, చరణ్, శ్రవణ్‌యాదవ్ తదితరులున్నారు.

లారీల కొరత లేకుండా చూడాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దైద రవీందర్

నకిరేకల్: నియోజకవర్గంలోని కొనుగోలు కేంద్రాల్లో మిగిలి ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, లారీల కొరత లేకుండా చూడాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దైద రవీందర్ డిమాండ్ చేశారు. బుధవారం నకిరేకల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నకిరేకల్, కేతేపల్లి, కట్టంగూర్, నార్కట్‌పల్లి, చిట్యాల, రామన్నపేట మండలాల్లో 30శాతం యాసంగి ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాకుండా కల్లాల్లోనే ఉందన్నారు. ధాన్యం కొనుగోలు చేసినా మిల్లుల వద్ద దిగుమతి సమస్య తీవ్రంగా ఉన్నందున లారీల కొరత ఏర్పడుతుందన్నారు. సమావేశంలో కౌన్సిలర్ గాజుల సుకన్య, మహేష్, నక్షత్ తదితరులున్నారు.

వైఎస్సార్‌టీపీ నాయకుల నిరసన

నల్లగొండ టూటౌన్: సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో అఖిలపక్ష మహాధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించినందుకుగాను బుధవారం నల్లగొండ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌టీపీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకుడు పర్వతం వేణు మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే బీఆర్ఎస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కొత్తపల్లి శ్రీనివాస్, విజయ్, శివ, రజనీకాంత్, కృష్ణ పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి


పందెనపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


కనగల్: లచ్చుగూడెంలో కంటివెలుగు శిబిరం ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. బుధవారం కట్టంగూర్ మండలంలోని పందెనపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఈదులూరులోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యం తూకం వేసిన బస్తాలను వెంటనే ఎగుమతి చేయాలని అధికారులకు సూచించారు. లారీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, జెడ్పీటీసీ తరాల బలరాములు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పోగుల నర్సింహ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, ఎంపీటీసీలు బీరెల్లి రాజ్యలక్ష్మిప్రసాద్, తవిడబోయిన భవాని పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం

కనగల్: మండల పరిధిలోని లచ్చుగూడెం గ్రామంలో ఎంపీపీ కరీంపాష, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం గౌడ్‌లు బుధవారం కంటివెలుగు శిబిరం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాంగిరి శ్రీధర్ రావు, పీఏసీఎస్ చైర్మన్ వంగాల సహదేవరెడ్డి, సర్పంచ్ వంగాల కళావతి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నర్సింగ్ జాని పాల్గొన్నారు.

శాలిలింగోటంలో శిబిరం ఏర్పాటు

శాలిగౌరారం: కంటివెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శాలిలింగోటం సర్పంచ్ పాక మానికయాదయ్య, ఎంపీటీసీ పాక రాములు కోరారు. బుధవారం శాలిగౌరారం మండలంలోని శాలిలింగోటం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వెంకన్న, గ్రామపంచాయతీ కార్యదర్శి అశోక్, వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

శాలిగౌరారం: సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ కోరారు. శాలిగౌరారం మండలంలోని ఊట్కూరు గ్రామ ఉపసర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కప్పల శ్రీధర్ బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న, ఊట్కూరు సర్పంచ్ వేముల లింగయ్య, నాయకులు నూక కిరణ్‌యాదవ్, రావుల రామచంద్రయ్య, దాసరి వెంకన్న తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యే గాదరి కిశోర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న ఉపసర్పంచ్ శ్రీధర్ తదితరులు

దశాబ్ది ఉత్సవాల్లో పెన్షనర్లందరూ పాల్గొనాలి

నల్లగొండ టూటౌన్: రాష్ట్రం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2 నుంచి నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాల్లో పెన్షనర్లు అందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాధనలో పాల్గొన్న తాము దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొంటామని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మునుగోడు: మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి నివాసంలో ఆయన వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారిలో భీమనపల్లి చంద్రయ్య, మందుల శంకర్, అన్నం సాయి, శ్రీకాంత్, మహేష్, నకిరెకంటి శ్రీకాంత్, ఉతాటి నర్సింహ, ఐతగోని సైదులు, అన్నం శ్రీశైలం ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురిగి నర్సింహగౌడ్, కందుల సూర్యప్రకాష్, జాల చందు తదితరులున్నారు.


కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో కృష్ణారెడ్డి

'మన బడి' పనుల పరిశీలన


కట్టంగూర్ హైస్కూల్‌లో డైనింగ్ హాల్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఈఈ రామ్‌చందర్

కట్టంగూర్: మనఊరు – మనబడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులు వేగవంతం చేయాలని ఈడబ్ల్యూఐడీసీ నల్లగొండ ఈఈ రామ్‌చందర్ అన్నారు. బుధవారం కట్టంగూర్ మండలంలోని గార్లబాయిగూడెం, రామచంద్రాపురం, దుగినవెల్లి ప్రాథమిక పాఠశాలలు, కట్టంగూర్ ఉన్నత పాఠశాలలో మనఊరు – మనబడి పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీఈ శైలజ, హెచ్‌ఎం సత్యనారాయణ, శంకర్, సీఆర్‌పీలు పోలగోని రవికుమార్‌గౌడ్, అంబర్ల సత్యనారాయణ ఉన్నారు.

స్వర్గపురి వాహనం ఏర్పాటు

చిట్యాల: మున్సిపాలిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన పరమపద వాహనం (స్వర్గపురి వాహనం)ను మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

మునుగోడు: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం పట్ల బుధవారం మునుగోడు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వారు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామి, జెడ్పీటీసీ నారబోయిన స్వరూపరాణి, ఎంపీడీఓ విజయ భాస్కర్, ఎంపీఓ సుమలత, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.


సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు

సీఎం, మంత్రులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు

నల్లగొండ టూటౌన్: మెడికల్ కళాశాలకు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డిలకు ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి బుధవారం కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మహిళా ఇన్‌చార్జ్‌గా దేవిక

నకిరేకల్: కాంగ్రెస్ పార్టీ నకిరేకల్ నియోజకవర్గ మహిళా ఇన్‌చార్జ్ దేవికను నియమిస్తూ మహిళా కమిటీ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు బుధవారం ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా దేవిక నియామకపత్రం అందుకున్నారు.


నియామక పత్రం అందుకుంటున్న దేవిక

ఫార్మా కంపెనీ నిర్మాణ పనులు నిలిపివేయాలి


గట్టుప్పలలో మండల కమిటీ సమావేశం నిర్వహిస్తున్న నాయకులు

చండూరు(గట్టుప్పల): గట్టుప్పల మండల కేంద్రంలో ఫార్మా కంపెనీ నిర్మాణ పనులు తక్షణమే నిలిపివేయాలని గట్టుప్పల సీపీఎం మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం అన్నారు. బుధవారం గట్టుప్పలలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫార్మా కంపెనీతో ప్రజలు కాలుష్యం బారిన పడతారని, సాగు భూములకు తీవ్ర నష్టం ఏర్పడుతుందన్నారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కర్నాటి సుధాకర్, కర్నాటి వెంకటేష్, పెద్దగాని నరసింహ, పసువుల చెన్నయ్య, తిరందాసు భిక్షమయ్య, మొద్దు గాలయ్య, నల్లవెల్లి భిక్షం, వడ్డేపల్లి లక్ష్మయ్య, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: నల్లగొండ పట్టణంలో రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నందున గురువారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6:30 గంటల నుంచి 10గంటల వరకు చైతన్యపురికాలనీ, కనకదుర్గకాలనీ, శాస్త్రీనగర్, ఎస్‌ఎల్‌బీసీ రోడ్డు, గంధవారిగూడెం రోడ్డు, దుప్పలపల్లి రోడ్డు తదితర ప్రాంతాల్లో పవర్ సప్లయ్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటా


దుస్తులు అందజేస్తున్న పగడాల ముత్తు

మర్రిగూడ: తల్లిదండ్రులను కోల్పోయిన మర్రిగూడ మండలంలోని శివన్నగూడ గ్రామానికి చెందిన పోలగోని మమత, మనీషా, శిల్పలకు అండగా ఉంటానని పగడాల కనకయ్య మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ పగడాల ముత్తు అన్నారు. బుధవారం వారికి మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులతోపాటు దుస్తులు అందజేశారు. గృహ నిర్మాణానికి అవసరమైన రేకులు, ప్రహరీ, విద్యుత్ కనెక్షన్‌కు సంబంధించి రూ.లక్ష వరకు అందజేస్తానని హామీ ఇచ్చారు. ముగ్గురు అక్కాచెల్లెళ్లు విద్యనభ్యసించేందుకు ఖర్చులు సైతం ఫౌండేషన్ భరిస్తుందని భరోసా కల్పించారు.

ఆర్థికసాయం అందజేత

కనగల్: మండల పరిధిలోని దర్వేశిపురం గ్రామానికి చెందిన గట్టిగుండ్ల గోపాల్ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందాడు. బుధవారం ఆయన దశదిన కర్మకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజు హాజరై గోపాల్ భార్య లింగమ్మకు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట జినుకుంట్ల రాములు, జినుకుంట్ల జయశంకర్, మాద నర్సింహగౌడ్, జినుకుంట్ల శ్రీనివాస్, నాగేష్ గౌడ్, చిలకరాజు శంకరయ్య, నవీన్‌గౌడ్, అంజయ్య, లింగస్వామి, చందు, శ్రీకాంత్, పవన్, సిద్ధు, దశరథ, నాగరాజు, సురేష్ తదితరులున్నారు.

నీలగిరిలో 'ఆర్‌ఆర్‌ఆర్'

- నల్లగొండలో రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ చేపట్టిన అధికారులు
- పాత దుస్తులు, వస్తువులు సేకరించి అవసరమైన పేదలకు అందించాలని నిర్ణయం
- మున్సిపాలిటీలోని 48 వార్డుల్లో ప్రత్యేక సెంటర్లు ఏర్పాటు
- 27వ తేదీ వరకు కొనసాగనున్న కార్యక్రమం


మున్సిపల్ సిబ్బందికి ప్లాస్టిక్ వస్తువులు అందజేస్తున్న 11వ వార్డు ప్రజలు

నల్లగొండ టూటౌన్: స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా నీలగిరి పట్టణంలో ఈనెల 19 నుంచి మున్సిపాలిటీ పరిధిలోని 48 వార్డుల్లో ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్ రీయూస్ రీసైకిల్) కార్యక్రమం చేపట్టారు. ఈమేరకు 48 వార్డుల్లో 48 సెంటర్లు ఏర్పాటు చేసి ఇళ్లల్లోని అవసరం లేని పాత వస్తువులను సేకరిస్తున్నారు. 27వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. తడి, పొడి చెత్తపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పిస్తూనే వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇంట్లో అవసరం లేని దుస్తులు, చెప్పులు, స్కూల్‌కు సంబంధించిన వస్తువులు, పాత పుస్తకాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, పాత దుప్పట్లు పనికొచ్చే తదితర సామగ్రిని వృథా కాకుండా మున్సిపల్ సిబ్బంది సేకరిస్తున్నారు. పాత వస్తువులు, పాత దుస్తులను బయట పడేయకుండా మున్సిపల్ సిబ్బందికి అందించాలని ప్రజలకు మెప్మా సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఇలా సేకరించిన వస్తువులు, దుస్తులను అనాథ శరణాలయాలకు, పేద పిల్లలకు, నైట్ షెల్టర్‌లో ఉండే వారికి అందజేయనున్నారు.

అవగాహనే కీలకం..

నీలగిరి పట్టణంలోని దాదాపు అన్ని కాలనీల్లో పాత దుస్తులు, పాత దుప్పట్లు, ప్లాస్టిక్ వస్తువులు, ఇతర పనికొచ్చే వస్తువులు కూడా ఖాళీ ప్లాట్లలో, రోడ్ల వెంట పడేస్తున్నారు. అంతేకాకుండా పలువురు వీటిని కాల్చి వేస్తున్నారు. ఇక నుంచి ఇలా వృథా కాకుండా ప్రజల నుంచి సేకరించి మున్సిపాలిటీలో పేదలకు అందించాలని అధికారులు నిర్ణయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడంతో పాటు ఇక నుంచి రాబోయే రోజుల్లో కూడా దీనిని కొనసాగించాలని మున్సిపల్ కమిషనర్ రమణాచారి నిర్ణయించారు. పాతవి రీయూస్ చేయడం వలన పేదలకు ఎంతో మేలు చేయడంతో పాటు వారికి ప్రయోజనం కలగనుందని పేర్కొంటున్నారు.

పాత వాటిని సేకరిస్తున్నాం



ఆర్‌ఆర్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా నల్లగొండ పట్టణంలోని 48 వార్డుల్లో సెంటర్లు ఏర్పాటు చేశాం. పాత వస్తువులు, పుస్తకాలు, దుస్తులు, వృథాగా అనిపించే తదితర వస్తువులను మున్సిపల్ సిబ్బందికి అందించాలి. వీటిని పేదలకు పంపిణీ చేయడం జరుగుతుంది. ఈమేరకు పట్టణ ప్రజలు సిబ్బందికి సహకరించాలి.

– రమణాచారి, మున్సిపల్ కమిషనర్, నల్లగొండ

రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ సెంటర్ల పరిశీలన

నకిరేకల్: స్వచ్ఛ భారత్ ఉద్యమంలో భాగంగా చేపట్టిన మేరీ లైఫ్.. మేరా స్వచ్ఛ షహర్‌ను జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్ బాలాజీ కోరారు. బుధవారం నకిరేకల్‌లో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ కార్యక్రమంలో భాగంగా పాత పేపర్లు, పుస్తకాలు, నోట్ బుక్స్, ప్లాస్టిక్ వస్తువులు, పెట్ బాటిల్స్, పాత చెప్పులు, పండ్ల, చెట్ల గింజలను మున్సిపల్ సిబ్బంది ఏర్పాటు చేసిన సెంటర్‌లలో వేయాలని తెలిపారు. ఆయన వెంట స్వచ్ఛ అంబాసిడర్ విద్యాసాగర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ నాగరాజు, మెప్మా ఆర్‌పీ రాధ తదితరులు ఉన్నారు.


నకిరేకల్‌లో ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ బాలాజీ

ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలి

మునుగోడు: ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ విజయ భాస్కర్ సిబ్బందికి సూచించారు. బుధవారం మునుగోడు మండలంలోని పులిపలుపుల గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. కూలి డబ్బుల చెల్లింపులో ఎలాంటి జాప్యం లేకుండా అందజేస్తామని తెలిపారు. అంతేకాకుండా రోజు కూలీ రూ. 220 తగ్గకుండా అందిస్తున్నామని చెప్పారు. కూలీలు ఉదయం 6 గంటలకు పనులకు వచ్చి ఎండ అధికం కాకముందే పని పూర్తిచేసుకొని ఇంటికి వెళ్లాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ శ్రీనయ్య, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులున్నారు.


పులిపలుపులలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్

వీఓఏల సమస్యలను పరిష్కరించాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు

మర్రిగూడ: వీఓఏల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ బుధవారం మర్రిగూడలో ఐకేపీ వీఓఏలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దేవులపల్లి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య మాట్లాడుతూ గత 38 రోజులుగా వీఓఏలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. వీఓఏలకు కనీస వేతనం రూ.26వేలు, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో రంగినేని చంద్రకళ, పానుగంటి పద్మ, మంజుల, సిరియాల, శోభా, మానస, జ్యోతి, సుమలత, యాదమ్మ, రాములు, మానస తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎస్‌సీని సద్వినియోగం చేసుకోవాలి

మర్రిగూడ: ఎంఎస్ఎస్‌సీ (మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మర్రిగూడ పోస్టాఫీస్ ఎస్‌ఓ వెంకటేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో మహిళలు రూ.వేయి నుంచి రూ.2లక్షల వరకు పొదుపు చేసుకోవచ్చని పేర్కొన్నారు. చేసిన పొదుపు మూడు నెలల తరువాత మరింత పొదుపును జమ చేసుకునే అవకాశం ఉంటుందని, ఈ పథకానికి 7.5 వడ్డీని ప్రభుత్వం చెల్లించనుందని తెలిపారు.

బొడ్రాయి వార్షికోత్సవం

మాడుగులపల్లి: మండలంలోని పాములపహాడు గ్రామంలో బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం బొడ్రాయి వద్ద వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. బొడ్రాయికి జలాభిషేకం, కొబ్బరి నీళ్లు, పాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం మహిళలు డప్పుచప్పుళ్లు, శివసత్తుల నృత్యాల మధ్య బోనాలతో ఊరేగింపుగా వెళ్లి దుర్గామాత ఆలయంలో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ యాతం లక్ష్మమ్మ, ఎంపీటీసీ కళింగరెడ్డి, మాజీ సర్పంచులు, సామాజిక కార్యకర్త వెంకటయ్య పాల్గొన్నారు.